క్లుప్తంగా

వైభవంగా దుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం



విగ్రహ ప్రతిష్ఠాపన చేస్తున్న భక్తులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అచ్చుగట్లపాలెం చిత్రావిచెరువు గట్టున ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద దుర్గమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠాపన చేశారు. శుక్రవారం వేకువ జామున నాలుగున్నర గంటల సమయంలో బొర్రా సాయివెంకట నరసింహారావు, ఇందిరామణి దంపతులు విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం దుర్గాదేవి హోమం చేశారు. మధ్యాహ్నంఅఖండ అన్నసమారాదన కార్యక్రమం నిర్వహించారు. బొర్రా రమాదేవి, బాబి గురుభవానీ పీఠం సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వాకర్స్ క్లబ్ ఆర్థిక సాయం



విద్యార్థులకు నగదు అందజేస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: ఆర్థిక ఇబ్బందులతో విద్యాభ్యాసం ఆగకూడదని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు అన్నారు. శుక్రవారం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక కుళాయి చెరువు గట్టున ఇద్దరు విద్యార్థులకు రూ.15 ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా సుధాకరరావు మాట్లాడుతూ చదవాలనే సంకల్పంతో ఉన్న విద్యార్థులకు ఆర్థిక ఇబ్బందులు ఎదురైతే దాతలు స్పందించి వారిని ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. డిగ్రీ మొదటి సంవత్సరం, ఇంటర్మీడియట్ చదువుతున్న ఇద్దరు విద్యార్థులకు నగదు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ పీర్‌సాహెబ్, ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు, సలాది రామచంద్రరావు, ధనాని శ్రీరామమూర్తి, నంబూరి గంగా పవన్, మేకా త్రిశూలపాణి, తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో క్రిస్మస్ సందడి

నరసాపురం: పట్టణంలో క్రిస్మస్ సందడి మొదలయ్యింది. పలు ప్రాంతాల్లో క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నారు. ఆత్మ దీపం సంస్థ ఆధ్వర్యంలో ప్రతి ఏటా నిర్వహించే క్రిస్మస్ ఆన్‌వీల్స్ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. థామస్ బ్రిడ్జి వద్ద కార్యక్రమాన్ని నరసాపురం ఆర్డీవో దాసి రాజు జెండా ఊపి ప్రారంభించారు. మూడు ట్రాలీ వ్యాన్‌లపై క్రిస్మస్ సందేశాలు వినిపిస్తూ, క్రిస్మస్ గీతాలు ఆలపిస్తూ పట్టణం అంతా ర్యాలీ నిర్వహించారు. పెద్ద ఎత్తున క్రైస్తవ యువత ప్రత్యేక క్రిస్మస్ దుస్తులు ధరించి ర్యాలీలో పాల్గొన్నారు. ఆత్మదీపం కన్వీనర్ చదలవాడ జ్ఞానప్రకాష్, సకిలే పెర్సిపాల్, పలువురు పాస్టర్లు పాల్గొన్నారు.

'ఏఎస్ఎన్ఎం' సెమిస్టర్ ఫలితాల విడుదల

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడు, ఐదో సెమిస్టర్ ఫలితాలు విడుదల చేశారు. శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి మాట్లాడుతూ నవంబర్ చివరి వారంలో ఈ రెండు సెమిస్టర్ పరీక్షలు నిర్వహించారన్నారు. మూడో సెమిస్టర్‌లో 157 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 66.24 శాతంతో 104 మంది ఉత్తీర్ణుల య్యారన్నారు. అలాగే ఐదో సెమిస్టర్‌లో 148 మంది హాజరు కాగా 91.22 శాతంతో 135 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు.

ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాల ముగింపు

మొగల్తూరు: మొగల్తూరులోని చేపల మార్కెట్ వీధిలో వేంచేసియున్న శ్రీ అభయాంజనేయ స్వామి వారి 42వ వార్షికోత్సవాలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. గత వారం రోజులుగా స్వామి వారికి నిత్య పూజలు నిర్వహించారు.

ఉచిత న్యాయ సహాయాన్ని పొందొచ్చు



ఖైదీల ఆరోగ్య వివరాలు తెలుసుకుంటున్న రత్నప్రసాద్

నరసాపురం: సబ్ జైలులో రిమాండ్ అనుభవిస్తూ బెయిల్ కోసం న్యాయవాదిని నియమించుకోలేని వారు ఉచిత న్యాయ సహాయాన్ని పొందొచ్చని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ సూచించారు. శుక్రవారం ఆయన నరసాపురం సబ్‌జైలును తనిఖీ చేశారు. రిమాండ్‌లో ఉన్న 70 ఏళ్ల పైడి వయస్సు ఉన్నవారు. ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న వారి వివరాలు సేకరించారు. సబ్ జైలులో వారికి అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ టి.అప్పారావు, న్యాయవాదులు ఎస్.ఆనంద్‌బాబు, ఎస్.రాంబాబు, కె.చిట్టి పద్మజ పాల్గొన్నారు.

శిథిలావస్థలో వంతెనలు



శిథిలావస్థకు చేరిన మత్స్యపురి వంతెన



కుంగిన రుస్తుంబాద-మంగళగుంటపాలెం వంతెన

- భయాందోళనలో ప్రయాణికులు
- కనీస మరమ్మతులు చేపట్టాలంటున్న స్థానికులు

నరసాపురం: పట్టణంలో పలు ప్రాంతాల్లో కాలువలపై నిర్మించిన వంతెనలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఒక వైపు ఎప్పుడు కూలి పోతాయో తెలియవన్నట్టుగా ఉన్న వంతెనలు, మరో వైపు ఆర్అండ్‌బీ అధికారులు వంతెనల పునఃనిర్మాణం విషయంలో దృష్టి పెట్టకపోవడంతో ప్రజలు భయం భయంగానే వంతెనలు దాటుతున్నారు. మరో వైపు చాలా ప్రాంతాల్లో కొత్తగా వంతెనలు నిర్మించాల్సిన అవసరం ఉన్నా అధికారులు ఆ అంశంపై దృష్టి పెట్టకపోవడం గమనార్హం. నరసాపురం-పాలకొల్లు రోడ్డులో ఉన్న మత్స్యపురి వంతెన శిథిలావస్థకు చేరింది. నిత్యం ఈ వంతెనపై అనేక బస్సులు, లారీలు వెళుతుంటాయి. మత్స్యపురి మీదుగా భీమవరం వెళ్లాలంటే ఈ వంతెన గుండానే ప్రయాణించాలి. ఈ వంతెనకు ఎప్పుడో 15 ఏళ్ల క్రితం మరమ్మతులు చేశారు. ఇంత ప్రాముఖ్యం ఉన్న ఈ వంతెన ప్రస్తుతం శిథిలమైంది. వంతెనపై గోతులు కూడా పడ్డాయి. ఇక రైల్వేస్టేషన్ రోడ్డుకు చేరుకోవడానికి ప్రధాన పంట కాలువపై ఉన్న వంతెన కూడా శిథిలావస్థకు చేరింది. మేదర్ల బ్రిడ్జిగా పిలిచే ఈ వంతెన ఓ వైపు కుంగిపోయింది. నరసాపురం-పాలకొల్లు రోడ్డులో ఇటీవల కాలంలో ట్రాఫిక్ బాగా పెరిగింది. మేదర్ల వంతెనను కొత్తగా బలంగా నిర్మిస్తే కొంత వరకూ ట్రాఫిక్‌ను రైల్వేస్టేషన్ రోడ్డు గుండా మళ్లించొచ్చు. చినమాయిడిపల్లి రైల్వే గేట్‌కు బైపాస్ రోడ్డు నిర్మించడంలో ఇటీవల ఈ బ్రిడ్జి మీదుగా వెళ్లే ట్రాఫిక్ బాగా పెరిగింది. అయితే ఈ వంతెనను బాగుచేసే విషయంపై అధికారులు దృష్టి పెట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. అలాగే రుస్తుంబాద నుంచి మంగళగుంటపాలెం వెళ్లే దారిలో కాలువపై వంతెన కూడా కూలడానికి సిద్ధంగా ఉంది. సుమారు 1500 ఎకరాల ఆయకట్టు రైతులు ప్రతి రోజూ ఈ వంతెన గుండానే ప్రయాణించాలి. ప్రభుత్వాసుపత్రి వద్ద ఉన్న కాలిబాట వంతెన కూడా ఎ మరమ్మతులకూ నోచుకోకుండా పోయింది.

ఎవరూ పట్టించుకోవడం లేదు

పాత వంతెనలు బాగు చేసే అంశాన్ని, కొత్త వంతెనల నిర్మాణ విషయాన్ని ప్రజా ప్రతినిధులు, అధికారులు ఎవరూ పట్టంచుకోవడం లేదు. దీంతో ఈ వంతెనల అభివృద్ధి అంశం అలాగే పెండింగ్‌లో ఉండిపోతుంది. పట్టణంలో పలు ప్రాంతాల్లో కాలువలపై కొత్త వంతెనలు నిర్మించాల్సి ఉంది. నరసాపురం-పాలకొల్లు రోడ్డులో పద్మశ్రీ రైస్ మిల్లు సమీపంలో కాలువపై కాలిబాట వంతెన నిర్మించాలని స్థానికులు ఎప్పటి నుంచో కోరుతున్నారు. ఇక్కడ కాలువ గట్టుకు ఆనుకుని సుమారు 150 కుటుంబాల వారు నివసిస్తున్నారు. ఇక్కడ వంతెన లేక పోవడంతో వారు తెప్పలు కట్టుకుని ప్రమాదపుటంచున ప్రతిరోజూ కాలువ దాటుతారు.

మత్స్యపురి వంతెన నిర్మించాలి



మత్స్యపురి వంతెన చాలా ముఖ్యమైనది. ఈ వంతెనను పెద్దగా నిర్మించాలి. కనీసం అప్పటి వరకూ మరమ్మతులైనా చేయాలి. ఎప్పుడో ఈ వంతెనను నిర్మించారు. అప్పటి నుంచి ఎలాంటి మరమ్మతులు చేయ లేదు. రైల్వేస్టేషన్ వెనుక నుంచి ఇప్పుడు కొత్తగా బైపాస్ నిర్మించారు. అక్కడ మురుగు కాలువపై వంతెన నిర్మించాలి.

–బళ్ల తాతాజీ

వైద్య ఉద్యోగుల ధర్నా



పీహెచ్‌సీ వద్ద నిరవన వ్యక్తం చేస్తున్న వైద్య సిబ్బంది

పెనుగొండ: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆయువు పట్టుగా ఉన్న మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలంటూ వైద్య ఉద్యోగులు డిమాండ్ చేశారు. వల్లూరు పీహెచ్‌సీ వద్ద శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. ప్రజారోగ్య పరి రక్షణకు, అందరికీ ఆరోగ్యం అందించేందుకు హెల్త్ అసిస్టెంట్లు కీలక భూమిక పోషిస్తారన్నారు. అటువంటి హెల్త్ అసిస్టెంట్లను తక్షణం విధుల్లోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు వేణుబాబు, హైందవి, జి.వసంత కుమారి, పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు ఏర్పాటును వ్యతిరేకిస్తూ ధర్నా



రుస్తుంబాదలో డంపింగ్‌యార్డు వద్దంటూ ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

నరసాపురం రూరల్: మండలంలోని రుస్తుంబాద గ్రామస్తులు ఆందోళనకు దిగారు. రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది శుక్రవారం సాయంత్రం రుస్తుంబాద గ్రామంలోని మండవారి గరువులో డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం అందడంతో సుమారు 300 మంది ఆ ప్రాంతానికి చేరుకుని వారిని అడ్డుకున్నారు. ఇదే సమస్యపై గతంలో ఉద్యమించగా స్పందించిన ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ రుస్తుంబాదలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయనని హామీ ఇచ్చారని కానీ ఇప్పుడు అధికారులు ఎందుకు వచ్చారని వారంతా ప్రశ్నించి అడ్డుకున్నారు. మున్సిపల్ కమిషనర్ సైతం భూమి కొనుగోలు చేసినప్పటికీ ఇక్కడ డంపింగ్ యార్డును ఏర్పాటు చేయబోమని తెలిపారన్నారు. దీంతో మున్సిపల్ కమిషనర్ అంజయ్య ఆందోళన చేస్తున్న గ్రామస్తులతో ఫోన్‌లో మాట్లాడారు. గ్రామస్తులు ఆందోళన చెందొద్దని ప్రభుత్వం నగదు చెల్లించినందున ఆ భూమిని స్వాధీనం చేసుకునేందుకే మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది వచ్చారని ఆయన వివరణ ఇచ్చారు. దీంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో మండ రమేష్, మండ పూర్ణ చందు, రామారావు, పలపర్తి మణి, కాసా వెంకటేశ్వరరావు, కాసా సూర్యనారాయణ, కొమ్ముల రమణ, గన్నాబత్తుల రామచంద్రరావు, మండ దుర్గ, భాను, గన్నాబత్తుల నాగేంద్ర, కాసా పార్వతి, నాగబాబు, కుటుంబరావు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలి

పెనుగొండ: ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహిస్తున్న వంట నిర్వాహకులకు కనీస వేతనాలు లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సూర్నీడి వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు తక్షణమే విడుదల చేయాలని కోరుతూ స్థానిక రామేశ్వరస్వామి ఆలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతి విద్యార్థికి పెరుగుతున్న ధరలకనుగుణంగా రూ.20 అదనంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు షేక్ ఫాదుషా, సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు వైట్ల ఉషారాణి, సీపీఎం మండల కార్యదర్శి మోహన్‌రావు, నేతలు బండి రంగారావు, తలుపూరి బుల్లబులు, తోటపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

లింగ వివక్షను విడనాడాలి

పాలకొల్లు అర్బన్: స్త్రీ, పురుషులను సమాన భావంతో చూడాలని మండల టీం లీడర్ మురళీకృష్ణ కోరారు. పాలకొల్లు మండలం కాపవరంలో రైతు సాధికారిక సంస్థ, ప్రకృతి వ్యవసాయం ఆధ్వర్యంలో లింగ వివక్షతపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. బాలల హక్కులు, లైంగిక వేధింపుల నిరోధక చట్టం, అక్రమ రవాణా, గృహ హింస తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ, ఏఎన్ఎం, డ్వాక్రా మహిళలు, ఆశ వర్కర్లు ర్యాలీలో పాల్గొని లింగ వివక్షకు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పద్మావతి, భానుశ్రీ, ప్రవల్లిక, నవీన్, సాయి, నాగరాజు, ఐసీఆర్‌పీ శ్రీలక్ష్మి, మీనా, తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలపై తీవ్ర నిరసన

పెనుగొండ: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వ్యాఖ్యలను నిరసిస్తూ శుక్రవారం సాయంత్రం ఆచంట కాలేజ్ రోడ్డులో అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల జెండాలతో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆచంట పెదపేటలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. కార్యక్రమంలో మాల మహానాడు సీనియర్ నేతలు బీరా మధు, సుంకర సీతారాం, కోట వెంకటేశ్వరరావు సీపీఎం మండల కార్యదర్శి పి.మోహన్‌రావు, ఎస్వీఎన్ శర్మ,తోటపల్లి సత్యనారాయణ, బండి రంగారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి



పెనుగొండ: సదస్సులో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సురేష్ బాబు



నరసాపురం రూరల్: రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న డీటీ ప్రసాద్



యలమంచిలి: వివాదాస్పద భూమిని పరిశీలిస్తున్న ఆర్డీఓ దాసి రాజు

రెవెన్యూ సదస్సుల్లో రైతుల వేడుకోలు

పెనుగొండ: భూముల రీసర్వే వలన ప్రతీ రైతుకు భూసమస్యలు తలెత్తుతున్నాయని, తక్షణం రీసర్వేను రద్దు చేయాలని జెడ్పీటీసీ ఉప్పల పాటి సురేష్ బాబు, పలువురు రైతులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆచంట పంచాయతీ వద్ద నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు.రీ సర్వే వలన రైతులు కష్టాలను ఎదుర్కొంటున్నారన్నారు. సిద్ధాంతం డీసీ చైర్మన్ తమ్మినీడి ప్రసాద్ మాట్లాడుతూ ఆచంట ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురయ్యాయని అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలోని వెంకట్రామపురం, మునమర్రులో పెనుగొండ తహసీల్దారు జి అనితకుమారి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కోట సరోజినీ వెంకటేశ్వరరావు, తహసీల్దారు జి.కనకరాజు, అధికారులు పాల్గొన్నారు.

నరసాపురం రూరల్: తమ భూములు రిజిస్ట్రేషన్లు కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పలువురు రైతులు వాపోయారు. శుక్రవారం మండలంలోని ఎల్బీచర్ల, చామకూరిపాలెం గ్రామ సచివాలయాల వద్ద సర్పంచ్‌లు గుబ్బల యమునా బానుమూర్తి, బొక్కా రామస్వామి అధ్యక్షతన రెవిన్యూ సదస్సులు నిర్వహించారు. గత ప్రభుత్వ హయాంలో భూముల రిజిస్ట్రేషన్లు సులభంగా జరిగేవని కానీ ఈ ప్రభుత్వం అధికారం చేపట్టాక 22ఎ లో జరిగే లావాదేవీల నన్నింటిని రిజిస్ట్రేషన్లు చేయవద్దంటూ ఆదేశాలివ్వడంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయంటూ రైతులు గగ్గోలు పెట్టారు. ఈ అసైన్డ్ భూముల సమస్యను పరిష్కరించాలని పలువురు రైతులు సదస్సులో అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో వీఆర్వోలు కటకంశెట్టి చిన్నా, మెహర్‌బాబా, శశిధర్, సర్వేయర్లు శిరాజుద్దీన్, ఎంపీవీ శ్రీనివాస్, భాస్కర్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద భూమిపై సమగ్ర విచారణ చేయండి

యలమంచిలి: చింతదిబ్బ గ్రామంలో డిస్ప్యూట్ రిజిస్టర్‌లో నమోదై ఉన్న సుమారు 70 ఎకరాలు భూమిపై సమగ్ర విచారణ చేయాలని నరసాపురం ఆర్డీఓ దాసి రాజు ఆదేశించారు. చింతదిబ్బ, ఇలపకుర్రు గ్రామాలలో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. సదస్సులో పాల్గొన్న ఆర్డీఓ దృష్టికి రైతులు వివాదాస్పద భూమి గురించి వివరించడంతో ఆయన స్వయంగా వెళ్లి ఆ భూములను పరిశీలించారు. కార్యక్రమంలో చింతదిబ్బ, ఇలపకుర్రు గ్రామ సర్పంచ్‌లు చిలుకూరి సూనావతి, కొండేటి జీవరత్నం, ఎంపీటీసీ సభ్యుడు కంబాల తిరుమల వెంకటేశ్వరరావు, తహసీల్దార్ గ్రంధి నాగ వెంకట పవన్‌కుమార్ డిప్యూటీ తహసీల్దార్ పూడి దేవిడ్సన్, వీఆర్వోలు యు.ప్రభాకర్, ఎ.నాగరాజు, రమేష్ గ్రామ సర్వేయర్లు రామ్ కిషోర్, దామోదర్, కళాంజలి, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోండి



వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్ రాజకిశోర్

మొగల్తూరు: గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కె.రాజకిశోర్ కోరారు. మండలంలోని రామన్నపాలెం గ్రామంలోని 1, 2వ సచివాలయాల పరిధిలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా రైతుల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. సమస్యలను పరిశీలించి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. రామన్నపాలెం ఒకటో సచివాలయ పరిధిలో 25 మంది రైతులు 12 వినతులు అందగా, రెండో సచివాలయం పరిధిలో రైతులు పది వినతులు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ బందెల ఏలిషా, ఉపసర్పంచ్ మేకల పరుశురామ్, సర్వేయర్ దస్‌రాజ్, ఆర్ఐ నిరంజన్, దేవదాయ శాఖ ఈవో శ్రీనివాస రెడ్డి, శ్రీనివాస రావు, వీఆర్వో రామారావు, తదతరులు పాల్గొన్నారు.

రసాయనశాస్త్ర విభాగంలో ఉద్యోగాలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్ జగన్‌మోహన్‌రెడ్డి

పాలకొల్లు సెంట్రల్: రసాయన శాస్త్ర విభాగంలో అనేక ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని దానికి అనుగుణంగా కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలని ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ రసాయనశాస్త్ర విభాగాధిపతి బి.జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఛాంబర్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు అధ్యక్షతన రసాయన శాస్త్ర విభాగంలో ఉద్యోగ అవకాశాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రసాయనశాస్త్ర విభాగంలో ఉద్యోగాలు సాధించాలంటే పాజిటివ్ యాటిట్యూడ్, హార్డ్ వర్క్, పర్సనాలిటి డెవలప్‌మెంట్ వంటి నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. దీని వలన ఫార్మా కంపెనీల్లో, ఐటి కంపెనీల్లోనే కాకుండా బార్క్, ఇస్రో వంటి రీసెర్చ్ సెంటర్లలో ఉద్యోగాలు పొందొచ్చన్నారు. కార్యక్రమంలో రసాయనశాస్త్ర ఇన్‌చార్జి యు.జానకి రామయ్య, వి.శేఖర్‌బాబు, ఎ.స్పందన, పి.తనూజ, తదితరులు పాల్గొన్నారు.

31 వరకు బీమా ప్రీమియం గడువు



రైతులకు బీమాపై అవగాహన కల్పిస్తున్న ఏవో చిండులూరి దేవి

యలమంచిలి: పంటల బీమా ప్రీమియం చెల్లించడానికి ఈ నెలాఖరు వరకు (డిసెంబర్ 31వ తేదీ) గడువుందని ఈ లోపు వరి సాగు చేసిన రైతులు ప్రీమియం చెల్లించాలని మండల వ్యవసాయాధికారి చిండులూరి దేవి కోరారు. కాజ, మేడపాడు గ్రామాలలో శుక్రవారం ఆమె రైతులకు ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పథకంపై అవగాహన కల్పించారు. వరి పంటకు ఎకరాకు రూ.615 బీమా చెల్లించాలన్నారు. ఈ సేవా కేంద్రాలు, సచివాలయాల్లో ప్రీమియం చెల్లించడానికి ఆధార్ జిరాక్స్, పట్టాదారు పాస్ బుక్, బ్యాంకు ఖాతా జిరాక్స్, రైతుసేవా కేంద్రం ఇన్‌చార్జి ద్వారా పంట ధ్రువీకరణ పత్రం తీసుకెళ్లాలని ఆమె వివరించారు.

పీఎం పంట బీమా యోజనలో చేరండి

మొగల్తూరు: ప్రధాన మంత్రి పంటల బీమా యోజన పథకంలో ప్రీమియం చెల్లించి సభ్యులుగా చేరాలని ఏవో అబ్దుల్ రహీమ్ కోరారు. శుక్రవారం మొగల్తూరు మూడో పచివాలయంలో ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పథకం అగ్రికల్చర్ ఇన్స్యూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా ద్వారా అమలవుతుందన్నారు.

పంటల బీమాను సద్వినియోగం చేసుకోవాలి

పెనుమంట్ర: ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని దాళ్వా సాగులో తమ పంటలకు రక్షణ కల్పించుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి అడబాల జోత్స్యల అన్నారు. శుక్రవారం ఆలమూరు, మార్టేరు గ్రామాల్లో రైతు సదస్సులు నిర్వహించారు. ఈ పథకానికి పంట రుణం ఉన్నా లేకున్నా అందరి రైతులు అర్హులేనని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది బి.దుర్గా ప్రసాద్, జి.కృష్ణగంగ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలి



నరసాపురం రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ వివి లక్ష్మి



పాలకొల్లు అర్బన్: శిక్షణ పొందిన సచివాలయ ఉద్యోగులు, మండల స్థాయి అధికారులు

ముగిసిన శిక్షణా తరగతులు

నరసాపురం రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఎంపీడీవో గాదిరాజు రామకృష్ణంరాజు మాట్లాడుతూ గ్రామాల సర్వతోముఖాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వ శాఖల సిబ్బంది ఒక లక్ష్యంతో పని చేయాలన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించడానికి పంచాయతీల్లో చేపట్టాల్సిన విధి విధానాల గురించి సిబ్బందికి వివరించారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్డీ కె.నాగేంద్రకుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లోకేష్, ఏపీఎం నాగభూషణనాయుడు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, వినయ్‌కుమార్, మత్స్యశాఖ ఉద్యోగి డాక్టర్ వీవీ లక్ష్మి, తదితరులు శిక్షకులుగా వ్యవహరించి పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల ఆవశ్యకత, లక్ష్యాలు, అభివృద్ధి ప్రణాళికల తయారీలో తీసుకోవసిన పలు విషయాలను గురించి వివరించారు. కార్యక్రమంలో మండలంలోని డిజిటల్, అగ్రికల్చర్, సర్వే అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

పేదరికం లేని గ్రామంగా తీర్చిదిద్దాలి

పాలకొల్లు అర్బన్: పేదరికం లేని ఆరోగ్యవంతమైన గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అధికారులు పని చేయాలని ఎంపీడీవో ఎస్ఎస్ ఉమామహేశ్వరరావు కోరారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై గత ఆరు రోజుల నుంచి మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, సచివాలయ ఉద్యోగులకు నిర్వహించిన శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. ఈ శిక్షణ తరగతులకు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి నిర్దేశించిన 9 అంశాలు, 17 లక్ష్యాలను అమలు దిశగా అధికారులు పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.రాజశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎస్ సురేష్ పాల్గొన్నారు.

కూలీలకు పని దినాలు పెంచాలి



ప్రజా వేదికలో మాట్లాడుతున్న డ్వామా పీడీ డాక్టర్ అప్పారావు

మొగల్తూరు: ఉపాధి కూలీలకు పని దినాలు పెంచేలా అధికారలు చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ డాక్టర్ కేసీహెచ్ అప్పారావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన 17వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా 2023-24 సంవత్సరంలో రూ.10.66 కోట్లతో చేపట్టిన 1790 పనులకు సంబంధించిన వివరాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు తిరుమాని బాపూజి, ఎంపీడీవో సీహెచ్ త్రిశూల పాణి, జిల్లా విజిలెన్స్ అధికారి కె.పురుషోత్తం, అంబుడ్సమన్ కె.ఆదినారాయణ, పీఆర్ ఏఈఈ వెంకటేశ్వరరావు, వెటర్నరీ డాక్టర్ నీలిమ, ఎంపీటీసీలు, జేఈ ఆనంద్,టీఏ వెంకటేశ్వరరావు, ఈవోపీఆర్డీ నవీన్ కిరణ్, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావానికి తరలి రావాలి



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు



యలమంచిలి: సమావేశమైన భజరంగ్‌దళ్ సభ్యులు

మొగల్తూరు: విజయవాడలో జనవరి ఐదో తేదీన నిర్వహించబోయే హైందవ శంఖారావం బహిరంగ సభకు ప్రతి ఒక్కరూ తరలి రావాలని కోరుతూ సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండలంలోని కొత్తోట, ముత్యాలపల్లి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ హిందువుల మనోభావాలను, సమస్యలను అర్థం చేసుకుని ప్రభుత్వాలు వెంటనే స్పందించాలనే లక్ష్యంతో నిర్వహించే హైందవ శంఖారావాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో తమ్ము వెంకట రమణమూర్తి, కటకంశెట్టి గోవర్ధన్, వాటాల విజయ భాస్కరరావు, తిరుమాని మహాలక్ష్మిరావు పాల్గొన్నారు.

హైందవ సభను విజయవంతం చేయాలి

యలమంచిలి: హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జనవరి ఐదో తేదీన విజయవాడ దగ్గరలోని కేసరపల్లిలో నిర్వహిస్తున్న హైందవ శంఖారావ సభను విజయవంతం చేయాలని భజరంగ్‌దళ్ జిల్లా ఇన్‌చార్జి ముత్యాల సత్యనారాయణ (చంటి) కోరారు. భజరంగ్‌దళ్ సభ్యులు రాయి సత్యనారాయణ, ఇనుకొండ నాగులు పాల్గొన్నారు.